క్లుప్తంగా

కలెక్టర్‌తో డిప్యూటీ మేయర్ శ్రీధర్ భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్‌ను నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో శ్రీధర్ కలిసి చిరు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నగరంలో ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. నగరంలో 98 వార్డులలో పార్కులు, గ్రీన్ బెల్ట్‌లు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల మంజూరు విషయమై ఆయనకు వినతిపత్రం అందించినట్టు శ్రీధర్ తెలిపారు.

రైతుబజారులో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఈవో నారాయణ రావు

విశాఖ విద్య: మర్రిపాలెం రైతు బజార్‌లో రైతులు, వ్యాపారస్తులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వేసవి దృష్ట్యా కూరగాయలు తక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయం చూడాలని ఈవో నారాయణ రావు సూచించారు. ఎక్కువ మొత్తంలో రైతు బజారుకు కూరగాయలు వచ్చేటట్టు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతు బజారుకు తీసుకొస్తున్న కూరగాయలు మారు వర్తకులకు, హోటళ్ల నిర్వాహకులకు అధిక మొత్తంలో అమ్మకాలు జరపరాదన్నారు. వినియోగదారులతో దురుసుగా ప్రవర్తించరాదని, నిర్దేశించిన ధరలకే విక్రయాలు జరపాలన్నారు. అలాగే రైతులందరూ ప్రతి కౌంటర్ వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతు బజార్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో రైతు బజార్ సబ్ స్టాఫ్ ప్రతాప్, రైతు కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న జడ్జి షణ్ముఖరావు

పెదగంట్యాడ: విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదేనని గాజువాక 13వ జిల్లా అదనపు జడ్జ్ జి.షణ్ముఖరావు అన్నారు. ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు గురి చేసినా, తాకరాని చోట తాకినా అటువంటి వారిపై పోక్సో కేసు నమోదు చేస్తే శిక్షలు ఎంత కఠినంగా ఉంటాయో తెలిపారు. ఇటీవల కాలంలో బాలికల పై జరుగుతున్న లైంగిక దాడులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థికి రూ.50 లక్షల ప్యాకేజీ



హర్షను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి : దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థి బలస హర్ష రూ.50 లక్షల వార్షిక ప్యాకేజీతో అమెజాన్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదన రావు మాట్లాడుతూ అధ్యాపకుల కృషి, విద్యార్థి పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హర్ష ఈ ఘనత సాధించాడని, తమకు గర్వంగా ఉందన్నారు. హర్షను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ప్రజల సమస్య పట్టదా?



62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో కుళాయిల నుంచి వస్తున్న బురద నీరు



62వ వార్డులో కుళాయిల బురద నీటిని పట్టుకుంటున్న మహిళలు

పారిశ్రామిక ప్రాంతంలో బురదనీటి సరఫరా ● నీరు కలుషితం కావడంతో ఆరోగ్య సమస్యలు ● పట్టించుకోని జీవీఎంసీ అధికారులు

సింధియా : గుక్కెడు నీటి కోసం పారిశ్రామిక ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా కావడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. స్మార్ట్ సిటీలో కనీసం తాగునీటికి హైరానా పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బురదతో పాటు పురుగులు, చిన్న చిన్న ప్లాస్టిక్ వ్యర్థాలూ వస్తున్నాయి. దీంతో కుళాయి నీరు తాగాలంటేనే భయమేస్తోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో రోజూ మంచినీటి ప్యూరిఫికేషన్ చేసి మరీ సరఫరా చేస్తున్నామని చెబుతున్న జీవీఎంసీ సిబ్బందికి బురద నీరు కనిపించడంలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు మూలిగే నక్కపై తాటి పండు పడినట్లు అన్న చందాన ఇప్పుడు జీవీఎంసీ సరఫరా చేస్తున్న నీరు కూడా కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 61వ వార్డు పరిధి గాంధీజీవీధి, వెంకన్నపాలెం, మరిడిమాంబకాలనీ, 62వ వార్డు పరిధి దుర్గానగర్, త్రినాథపురం, ప్రకాష్‌నగర్, 63వ వార్డు పరిధి క్రాంతినగర్, కాకరలోవ, జైఆంధ్రాకాలనీ వంటి ప్రాంతాల్లో కుళాయిల ద్వారా నురగ, బురదతో పాటు దుర్వాసనతో కూడిన కలుషిత నీరు సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

లీకేజీలతోనే సమస్య....

కలుషితమైన నీటి సరఫరాకు లీకేజీలే కారణం. ఇటీవల కాలంలో తవ్వి వదిలేసిన నీటి గుంతలు, మురుగు కాలువల్లో వేసిన పైపులైన్లతో తాగునీరు కలుషితమవుతోంది. ఇప్పటికే పలు చోట్ల లీకేజీలను జీవీఎంసీ సిబ్బంది గుర్తించినప్పటికీ వాటిని సరిచేయకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది.

మున్సిపల్ కుళాయిల ద్వారా సరఫరా చేసే నీటిని ఫిల్టర్‌బెడ్‌లను ఉపయోగించి శుద్ధి చేయాల్సిన ఇంజినీర్లు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అయితే నీటిని శుద్ధి చేసే ఫిల్టర్‌బెడ్‌లను ఎప్పటికప్పుడూ మార్చి నూతన ఫిల్టర్‌బెడ్‌లను ఉపయోగించాల్సి ఉండగా, అది ఖర్చుతో కూడిన పనికావడంతో జీవీఎంసీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రంగు మారిన, దుర్వాసనతో నీటి సరఫరాను వెంటనే నిలిపివేయాలని, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైన జీవీఎంసీ సిబ్బంది స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కలుషిత నీటితో అనారోగ్యం



మా ప్రాంతంలో కలుషితనీరు తాగి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాం. డ్రైనేజీ పైపులు, తాగునీటి పైపులు పక్కపక్కనే ఉన్నాయి. తాగునీటి పైపులు లీకవడంతో డ్రైనేజీ మురుగంతా ఇందులో కలిసిపోతోంది. పాతపైపులైన్లకు సకాలంలో మరమ్మతులు చేయక అవి తుప్పుపట్టి లీకేజీలు ఏర్పడ్డాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.
– సావిత్రి, 62వ వార్డు

లీకేజీలను అరికట్టాలి



స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలి. నీరు కలుషితమైన రోజులు సిబ్బంది హడావిడి చేసి వెళ్లిపోవడమే తప్ప సమస్య మాత్రం పూర్తిస్థాయిలో పరిష్కరించడం లేదు. ముందు లీకేజీలను అరికట్టి, పాతపైపులైన్లకు మరమ్మతులు చేపడితే తప్ప సమస్య పరిష్కారంకాదు.
– లక్ష్మి, మల్కాపురం

'యువత పోరు' జయప్రదం చేయాలి



యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్

సింధియా: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టరేట్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ మళ్ల విజయప్రసాద్ కోరారు. కార్యక్రమ పోస్టర్‌ను సీతమ్మధారలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మోసపూరిత హామీలతో యువతను, విద్యార్థులను మోసగించడంపై పెద్ద ఎత్తున నిరసన తెలపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్లు పీవీ సురేష్, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, ముర్రు వాణి నానాజీ, వివిధ వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గులివిందల కృష్ణ, ఆడారి శ్రీనివాసరావు, చుక్క ప్రసాద్‌రెడ్డి, గొర్ల అప్పలస్వామినాయుడు, జీవీఎస్ఎన్ రాజు(వాసు), పిన్నింటి అప్పలరాజు, జిల్లా యూత్ అధ్యక్షులు దొడ్డి కిరణ్, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు గల్లా శ్రీను, సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొణతాల ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



లోకేష్ (ఫైల్)

గోపాలపట్నం : తన ప్రేమను అంగీకరించలేదని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొత్తపాలెం ఆదర్శనగర్‌లో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు.. కొట్యాడ శ్రీనివాసరావు ఆదర్శనగర్‌లో నివాసముంటున్నాడు. కార్పెంటర్‌గా పని చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీనివాసరావు మనవడు కొట్యాడ లోకేష్ (19) ఇటీవల ఐటీఐ పూర్తి చేసి ఏసీ మెకానిక్ వద్ద పని చేస్తున్నాడు. రెండు రోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఒంటరిగా ఉంటున్నాడు. లోకేష్ కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల ఆ యువతి తన ప్రేమను అంగీకరించలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి యథావిధిగా భోజనం చేసి ఇంటి పై అంతస్తులో నిద్రపోయేందుకు వెళ్లాడు. మంగళవారం ఉదయం 11 గంటలైనా బయటకు రాకపోవడంతో తల్లి రామలక్ష్మి వెళ్లి చూడగా..తలుపులు తెరవలేదు. కిటికీ తలుపులు తెరిచి చూడగా..గదిలో ఫ్యాను హుక్కుకు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సాయంతో ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే లోకేష్ మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. సీఐ గొలగాని అప్పారావు నేతృత్వంలో ఎస్ఐ రామారావు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

నారీశక్తి ప్రోత్సాహంతోనే దేశ పురోభివృద్ధి



మహిళా ఉద్యోగిని సత్కరిస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు



కార్యక్రమానికి హాజరైన మహిళా ఉద్యోగులు

- జీపీఎంఎస్ ఉప ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్
- నేవల్ డాక్‌యార్డ్‌లో మహిళా దినోత్సవం

సింధియా: విభిన్న రంగాల్లో నారీశక్తిని ప్రోత్సహించడం ద్వారా దేశ పురోభివృద్ధి సాధ్యపడుతుందని భారతీయ మజ్దూర్ సంఘం అనుబంధ భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘం (బీపీఎంఎస్) ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి పుట్టి విద్యాసాగర్ అన్నారు. ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ యూనియన్ ఆధ్వర్యంలో నేవల్ డాక్‌యార్డ్‌లో మంగళవారం మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు సహనశీలులు, కార్యశీలులు మాత్రమే కాదని, శక్తి స్వరూపాలని పేర్కొన్నారు. నారీశక్తిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడం ద్వారా దేశంలో మహిళా సాధికారతకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని కోరారు. దైనందిన జీవితంలో స్త్రీ పాత్రలేని రోజును ఊహించలేమన్నారు. పారిశ్రామిక, ఆర్థిక, రాజకీయ, పరిపాలనా రంగాల్లో పురుషులతో పాటు సమానంగా అవకాశాలు కల్పించడం ద్వారా దేశ పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు సత్కారం

యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ తూర్పు నావికాదళ పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తమ యూనియన్ కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ క్వాలిటీ సర్కిల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ముగ్గురు మహిళా ఉద్యోగులతో పాటు డాక్‌యార్డ్ ఉమెన్స్ ఫోరమ్‌కు చెందిన పలువురు ఉద్యోగినులను ఐఎన్‌సీఎంఎస్ యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌సీఎంఎస్ గుర్తింపు యూనియన్ గౌరవాధ్యక్షుడు పైలా దేముడునాయుడు, కోశాధికారి పి.సురేష్, వర్క్స్ కమిటీ సభ్యులు రెడ్పిల్లి యోగిత, ఉమామహేష్, శ్రీనివాస్, జేసీఎం సభ్యులు శివ కాసుబాబు, అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



నో ఆల్కహాల్ బోర్డు ప్రదర్శిస్తున్న అతిథులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మల్కాపురం: విద్యార్థులకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని విద్యాశాఖ అధికారి త్రినాథరావు, బౌద్ధ ప్రచారకులు రామచంద్ర ధర్మానంద, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి సూచించారు. మత్తు పదార్థాలతో జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. జీవీఎంసీ 61వ వార్డు ఇంద్రస్త్రియల్‌కాలనీ వద్ద గల బౌద్ధరామమ్ ఆధ్వర్యంలో మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 'ఆల్కాహాలు వద్దు..చదువే ముద్దు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ గంజాయి, మద్యపానం, పొగాకు, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన యువత నేడు ఎన్ని ఇబ్బందులు పడుతోందో వివరించారు. వీటికి దూరంగా ఉంటూ చదువుపై ధ్యాస పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

61వ వార్డులో శునకాల బెడద



సేవా మార్గంలో శునకాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డులో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెద్ద తలనొప్పిగా మారింది. కుక్కలు గుంపులు చేరి దారినిపోయేవారిపై దాడి చేస్తున్నాయి. వార్డు పరిధి మల్కాపురం, గాంధీజీ వీధి ప్రాంతాలలో కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో ఇటువైపు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ ప్రాంతం నుంచి కుక్కలను తరలించాలని కోరుతున్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర



అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: కంచరపాలెం రామ్మూర్తిపంతులు పేట ఆరాధ్య దైవత, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన పైడిమాంబ అమ్మవారి జాతర గౌరీ సేవా సంఘం గ్రామాధ్యక్ష-కార్యదర్శులు కొణతాల గోవిందరాజు, బొడ్డేటి నర్సింగరావు(చిన్న) నేతృత్వంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు దీరారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. అమ్మవారి ప్రతిమలతో రైల్వే గేటు వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి నిర్వహించారు. సుమారు 385 ఘటాలను మూలవిరాట్ వద్ద నుంచి ఆమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. కోలాటాలు, తప్పెడుగుళ్లు, నేలవేషాలు నడుమ అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. అనంతరం ప్రధాన ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. నగర పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. పాలవర్గ సభ్యులు కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, బి.పైడిరాజు ఎ.పైడిరాజు, కె.సురేష్, బి.శేఖర్, ఎం.అప్పారావు, ఉత్సవ కమిటీ పనులు పర్యవేక్షించారు.

అయోధ్యరామ్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీసు రద్దు చేయాలి



స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్‌కు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసును ఉపసంహరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. షోకాజ్ నోటీసు ఉపసంహరణ, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిలుపుదల తదితర డిమాండ్ల పై పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు రూ.11,440 కోట్లు ప్యాకేజి ప్రకటించి ఆ సొమ్మును బ్యాంకులకు చెల్లించడం జరిగిందన్నారు.

ఉత్పత్తి పెంచేందుకు, జీతాలు చెల్లించేందుకు వినియోగించలేదన్నారు. ఒకవైపు ప్యాకేజి ప్రకటించి మరోవైపు వీఆర్ఎస్ పేరిట 1,130 మంది ఉద్యోగులను తగ్గించడం, కాంట్రాక్ట్ కార్మికులు వేలాది మంది తొలగింపు వంటి చర్యలకు పాల్పడటం అన్యాయమన్నారు. అంతే కాకుండా సుమారు 6 వేల మంది కార్మికులకు హెచ్ఆర్ఏ నిలిపివేయడంతో పాటు ఉక్కునగరంలో నివశిస్తున్న కార్మికుల విద్యుత్ ఛార్జీలు యూనిట్ రూ.8లకు పెంచడం జరిగిందన్నారు. యాజమాన్యం తమ నిరంకుశ వైఖరి మార్చుకుని షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు నిలిపివేయడంతో పాటు ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమావేశాల్లో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. అయోధ్యరామ్, రమణమూర్తి, యు. రామస్వామి, జె. రామకృష్ణ, సుబ్బయ్య, మహాలక్ష్మినాయుడు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న గాజువాక బార్ అసోసియేషన్ ఎన్నికలు

గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు సంఘం అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకరరావు, టి.పుల్లయ్య నాయుడు తదితరులు ఎన్నికల షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈనెల 17న నామినేషన్ పత్రాల దాఖలు, 19న ఉపసంహరణ, 28న ఎన్నికల నిర్వహణ ఉంటాయని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం ఓట్లను లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది వాడాడ శ్రీనివాసరావును ఎన్నికల అధికారిగా, పి.పార్వతీశాన్ని సహాయకుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత కార్యవర్గం సంతృప్తికరంగా సేవలను అందించిందని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



గోపాలపట్నం ఫుట్‌పాత్‌పై గొయ్యి

గోపాలపట్నం: బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై గోతులు ప్రమాదకరంగా తయారయ్యాయి. జీవీఎంసీ 91వ వార్డులో బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో డక్ట్‌పై పలక తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం ఆదమరిచినా గోతిలో పడితే తీవ్ర గాయాలపాలవుతామని పాదచారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డస్ట్‌బిన్‌లా డక్ట్ : ఫుట్‌పాత్ డక్ట్ ఇక్కడి దుకాణదారులకు చెత్తబుట్టలా ఉపయోగపడుతోంది. రోజూ ఊడ్చిన చెత్తను ఇందులో వేసేస్తున్నారు. దీంతో మురుగు ప్రవహించక ఇబ్బంది ఏర్పడుతోంది. ఇటీవల ఈ డక్టుల్లో ఉన్న చెత్తను పారిశుధ్య విభాగ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. ఇపుడు మళ్లీ దీనిలో చెత్తను వేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ కేవీ, వీవీవీలో అడ్మిషన్లు చేపట్టాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం (కేవీ), విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)లో 2025–26 సంవత్సరానికి గానూ అడ్మిషన్లు ప్రారంభించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి. గాంధీకి వినతిపత్రం అందజేశారు. పై రెండు పాఠశాలలు నిర్వహణకు అవసరమైన నిధులను విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే సమకూరుస్తోందన్నారు. గత ఏడాది ఒకటో తరగతి, కేవీలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు నిలిపి వేశారన్నారు. దానిపై తీవ్ర ఆందోళన చేయడంతో వెనక్కు తగ్గారన్నారు. ప్రస్తుతం అన్ని పాఠశాలలు ఒకటో తరగతి అడ్మిషన్లు ప్రారంభించగా కేవీ, వీవీవీలో ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. దీంతో నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. అదే విధంగా ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా యాజమాన్యం నిరాకరిస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్‌లు అడ్మిషన్ల ప్రారంభించేలా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చిరంజీవి పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై చర్యలు



మాట్లాడుతున్న హార్బర్ ఏసీపీ కాళిదాసు

పెదగంట్యాడ: ప్రజా పంపిణీ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొంతమంది దళారులు అక్రమంగా రవాణా చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హార్బర్ ఏసీపీ కాళిదాస్ హెచ్చరించారు. స్థానిక న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశానుసారం నెల రోజులుగా బియ్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై నిఘా ఉంచామని తెలిపారు. ఇందులో భాగంగా అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.2,09,912 విలువ చేసే 5,524 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే బియ్యాన్ని తరలిస్తున్న గెంబలి ప్రసాద్, పెద్దిన కొండలరావు, అంకాల నారాయణపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే బియ్యాన్ని రవాణా చేస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.